# మేయర్‌కు ధిక్కార స్వరం!

ప్రశ్నల వర్షం సంధించిన మహిళలు

ఒక వైపు ఇందిరమ్మ ఇండ్ల బాధితుల ఘెరావ్

మరో వైపు సొంత పార్టీ నాయకుల నుంచి నిరసన

కూకట్‌పల్లి పర్యటనలో అనుభవాలపై విస్తృత చర్చ



ప్రజల ప్రశ్నలకు సమాధానం ఇయ్యలేక చేతులు జోడించి వేడుకుంటున్న మేయర్ విజయలక్ష్మి, చిత్రంలో పలువురు స్థానికులు

సిటీబ్యూరో/అల్లాపూర్/బాలానగర్, జనవరి 8(నమస్తే తెలంగాణ): ఒక్క నియోజకవర్గం పర్యటనలో రెండు చేదు అనుభవాలు నగర మేయర్‌కు ఎదురయ్యాయి. కూకట్‌పల్లి నియోజకర్గంలో బుధవారం పర్యటించిన మేయర్ విజయలక్ష్మికి రెండు వేర్వేరు ఘటనలు షాకిచ్చాయి. ఊహించని రీతిలో ఎదురైన ఘటనలపై మేయర్ ఆశ్చర్యపోయారు. వారు సంధించిన ప్రశ్నలకు ఏం చేయాలో? ఏ విధంగా సమాధానం ఇవ్వాలో అర్థం కాక కొద్ది సేపు మౌనంగా ఉండిపోయారు. ఆ తర్వాత తనదైన శైలిలో అధికారులపై, ఇటు కాంగ్రెస్ లీడర్లపై చురకలు అట్టించారు. మధ్యలో కాలనీ, బస్తీ పర్యటనల సందర్భంగా స్థానికులు మేయర్‌కు అడుగడుగునా సమస్యల స్వాగతం పలకడం గమనార్హం. మొత్తంగా మేయర్ పర్యటన రోజంతా విస్తృత చర్చకు దారి తీసింది. స్టాండింగ్ కమిటీ సభ్యుల వినతి మేరకు గడిచిన రెండు రోజులుగా మేయర్ నియోజకవర్గాల వారీగా క్షేత్రస్థాయి పర్యటనలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బాలానగర్, అల్లాపూర్ డివిజన్లలో జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులతో కలిసి మేయర్ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు క్షేత్రస్థాయి పరిస్థితులపై సందర్శించారు. బాలానగర్ డివిజన్ పర్యటన సందర్భంగా మేయర్‌ను స్థానిక కాంగ్రెస్ నాయకులు మేయర్‌ను అడ్డుకుని నిలదీశారు. ఆ తర్వాత అల్లాపూర్‌లో ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుదారుల నుంచి రూ.500లు వసూలు చేస్తున్నారని, ఇదెక్కడి న్యాయమని మేయర్‌ను లబ్ధిదారులు నిలదీశారు. మేయర్‌ను చుట్టుముట్టి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మేయర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టిన జోనల్ అధికారులు హౌజింగ్ సర్వే (రిసోర్స్ పర్సన్) అనితను డీసీ వంశీకృష్ణ సస్పెండ్ చేశారు.

### మేయర్‌కు మహిళల రౌండప్..

పైసలు ఇస్తేనే ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులు పరిశీలిస్తమని, లేకుంటే మీకు ఇండ్లు రావని అధికారులు తమను బెదిరిస్తున్నరని అల్లాపూర్‌లో పర్యటించిన మేయర్‌ను చుట్టుముట్టిన మహిళలు అధికారుల పనితీరుపై ప్రశ్నల వర్షం కురిపించారు. మూడు రోజులుగా జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తు పరిశీలనలో కొందరు అధికారులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, దయచేసి ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు దక్కేలా చూడాలని న్యూ అల్లాపూర్‌కు చెందిన మహిళలు మేయర్ వద్ద మొర పెట్టుకున్నారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న పింఛన్లు, రేషన్ కార్డులు, మహిళలకు స్కూటీలు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌తో పాటు తులం బంగారం ఎప్పుడు ఇస్తారు? అని మేయర్‌ను నిలదీశారు. ప్రజలు సంధించిన ప్రశ్నలకు అవాక్కైన మేయర్ ఏం చెప్పాలో పాలుపోక కొద్ది సేపు మౌనం వహించక తప్పలేదు. ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపికలో అధికారులు అవినీతికి మేయర్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే డీసీ, జేడీకి 24 గంటల్లో నివేదిక ఇవ్వాలని మేయర్ ఆదేశించారు. అంతకు ముందు ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులు పారదర్శకంగా పరిశీలించాలని, అర్హులైన వారికే ఇందిరమ్మ ఇండ్లు కేటాంచేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను మేయర్ ఆదేశించి, మెల్లగా అక్కడి నుంచి జారుకున్నారు.

### సమస్యలపై ఏకరువు

క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా అడిగి తెలుసుకునేందుకు మేయర్ అల్లాపూర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించగా.., అడుగడుగునా సమస్యలను ఏకరువు పెట్టారు. మొదట సఫ్దార్‌నగర్‌లో పర్యటించిన మేయర్‌ను చుట్టుముట్టిన కాలనీవాసులు, మా ప్రాంతంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు స్ట్రీట్ లైట్లు వంటి మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామని మేయర్‌ను నిలదీశారు. బీర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చొరవతో మంచినీటి పైపులైన్లు వేశారు. ఏడాది గడుస్తున్నా బూస్టర్లు బిగించకపోవడంతో తాగునీరు సరఫరా కావడం లేదని, దీంతో నిత్యం రూ. వందలు వెచ్చించి వాటర్ క్యాన్లు కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొందని చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తాని, అందుకు తగిన నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటానని మేయర్ హామీ ఇచ్చారు.

### నిలదీసిన సొంత గూటి పక్షులు

మేయర్ విజయలక్ష్మిని బాలానగర్ డివిజన్ కాంగ్రెస్ నేతలు ఘెరావ్ చేశారు. బాలానగర్ డివిజన్‌లో నెలకొన్న పలు సమస్యల పరిష్కారం కోసం స్టాండింగ్ కమిటీ సభ్యులు, స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు మేయర్ గద్వాల విజయలక్ష్మి పర్యటనకు వచ్చారు. నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేశ్‌కు సమాచారం లేకుండా బీఆర్ఎస్ కార్పొరేటర్ పిలువగానే బాలానగర్‌లో పర్యటనకు ఎందుకు వచ్చారు? అని నగర మేయర్‌ను స్థానిక కాంగ్రెస్ నేతలు ప్రశ్నల వర్షం కురిపించారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్ గౌడ్

## సర్దార్ పాపన్న స్ఫూర్తితో హక్కులను సాధించుకోవాలి

మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

ఖైరతాబాద్, జనవరి 8: సర్దార్ సర్వాయి పాపన్న స్ఫూర్తితో గీత వృత్తిదారులు తమ హక్కులను సాధించుకోవాలని మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. గౌడ ఐక్య సాధన సమితి ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, భారతదేశంలో పరిశ్రమలు లేనప్పుడు ఏకైక పరిశ్రమ గీత పరిశ్రమేనని అన్నారు. ఈ పరిశ్రమను ఆధునీకరించకుండా అణచివేశారన్నారు. నేటికీ గీత వృత్తిదారులపై దౌర్జన్యాలు జరుగుతూనే ఉన్నాయని, అక్రమ కేసులు, పీడీయాక్టులు పెడుతున్నారన్నారు. రాష్ట్రంలో పాలు సుమారు 14 లక్షల లీటర్ల కంటే ఎక్కువగా ఉత్పత్తి కావని, కానీ, 56 లక్షల లీటర్లను నేడు ప్రజలు వినియోగిస్తున్నారన్నారు. అయితే, పాలు ఎక్కడి నుంచి వస్తున్నాయని, అందులో జరుగుతున్న కల్తీపై పాలకులు దృష్టి పెట్టాలన్నారు. కానీ, కల్లులో కల్తీ జరుగుతున్నదంటూ గీత వృత్తిదారులపై అక్రమ కేసులు పెడుతున్నారని, ప్రకృతి పరంగా అనేక ఆరోగ్య విలువలున్న కల్లుపై నిషేధాజ్ఞలు పెట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. గత ప్రభుత్వ హయాంలో గౌడలకు ఆత్మగౌరవ భవనం కోసం రూ.500 కోట్ల విలువైన భూమి, రూ.5 కోట్ల నిధులు ఇచ్చారని, ఆ నిర్మాణ పనులను పూర్తి చేయాలన్నారు. ఆ భవనం ఎంతో ఉపయోగపడుతుందని, గౌడ విద్యార్థుల కోసం కోచింగ్ సెంటర్లు, కాన్ఫరెన్స్ హాళ్లు, రాష్ట్రంలోని 33 జిల్లాలకు ఒక వేదికగా రూపొందించుకోవచ్చన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నీరా కార్పొరేషన్‌తో పాటు సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాలను ఏర్పాటు చేశామని, గీత వృత్తి అభివృద్ధికి అనేక పథకాలు అమలు చేశామన్నారు. సంఘాలన్ని సంఘటితంగా తమ హక్కులను సాధించుకోవాలని, వృత్తిని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం, గౌడ ఐక్య సాధన సమితి క్యాలెండర్‌ను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అంబాల నారాయణ గౌడ్, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, బీసీ కమిషన్ సభ్యురాలు బాల లక్ష్మితో కలిసి ఆవిష్కరించారు. సమావేశంలో గోపా అధ్యక్షులు బండి సాయన్న, పల్లె రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సీసీఐ నిబంధనలు అమలు చేయండి

తెలంగాణ ఎక్సైజ్ శాఖ డెరైక్టర్ చెవ్వూరు హరికిరణ్

హైదరాబాద్, జనవరి 8(నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాంపిటిషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) రూల్స్ తెలంగాణ బేవరేజ్ కార్పొరేషన్‌లో అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఎక్సైజ్ శాఖ డెరైక్టర్ చెవ్వూరు హరికిరణ్ ఆదేశించారు. అబ్కారీ భవన్‌లో బుధవారం సీసీఐ నిబంధనలపై స్టేట్ రిసోర్స్ పర్సన్ ఆర్‌సీ కుమార్ ఇతర యంత్రాంగం కలిసి కార్పొరేషన్ ఉద్యోగులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ డైరెక్టర్ మాట్లాడారు. కంపెనీల మధ్య కాంపిటీషన్ ఉంటే వినియోగదారులకు కొంత మేలు జరుగుతుందని, అదే వారు సిండికేట్‌గా మారితే వినియోగదారులకు నష్టం జరుగుతుందని కుమార్ వివరించారు. సీసీఐ రూపొందించిన చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఎక్సైజ్ శాఖలో పలు శాఖల పరిధిలో కోర్టు కేసులకు సంబంధించిన విషయంలో ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ డెరైక్టర్ హరికిరణ్ సూచించారు. పలు శాఖల్లో కొనసాగుతున్న కోర్టు కేసులపై రివ్యూ నిర్వహించారు. ప్రధానంగా కోర్టు ఇచ్చిన నోటీసులకు వెంటనే స్పందించాలని, నిర్ణీత సమయంలోపు సమాధానం ఇవ్వాలన్నారు. కోర్టులో వేసే రిట్ పిటిషన్లపై, వివిధ రకాల రిట్ పీల్స్‌పై కంటెంట్ ఆఫ్ కోర్ట్ కేసులపై చాలా సీరియస్ ఉండాలన్నారు. ఈ విషయంలో ఎస్ఓలు ఇతర పర్యవేక్షణ అధికారులు స్పందించాలని ఆదేశించారు. బీసీ జీఎంలు అబ్రహం, కాశీనాథ్, శీలం శ్రీనివాసరావు, ఏసీ అజయ్ రావు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలకు రెండెకరాల స్థలం మంజూరు

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కృషి ఫలితం



నేరేడ్‌మెట్, జనవరి 8: మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల శాశ్వత భవన నిర్మాణం కొరకు స్థలం మంజూరు చేయడం సంతోషకరమని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఈ విషయం తెలుసుకున్న కళాశాల ప్రిన్సిపాల్ బండి రాజు, విద్యార్థులు, స్థానిక నాయకులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి బుధవారం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కళాశాలకు ప్రత్యేక భవనం కావాలని పలుమార్లు కలెక్టర్‌ను కోరడంతో, కలెక్టర్ స్పందించి వెంటనే రెండెకరాల స్థలం కేటాయించడం జరిగిందన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బండి రాజు మాట్లాడుతూ, మల్కాజిగిరి డిగ్రీ కళాశాల 2013లో మంజూరు అయ్యిందని అప్పటి నుంచి సొంత భవనం లేక విద్యార్థులు, అధ్యాపకులు అనేక ఇబ్బందులు పడ్డారని, ఆరేండ్లుగా శాశ్వత భవనం నిమిత్తం చేసిన అవిరళ కృషికి నేడు ఫలించినదని, ఇది సంతోషకరమని ఆయన తెలిపారు. గతంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఇచ్చిన అభ్యర్థనలు ఆధారంగా ఉత్తర్వులు జారీ చేయడంతో అధ్యాపకులు, విద్యార్థులు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌కు, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## సికింద్రాబాద్ నుంచి చర్లపల్లికి 10 నిమిషాలకో బస్సు

ఆర్టీసీ చెంగిచెర్ల డిపోలో మాట్లాడుతున్న డిపో మేనేజర్ కే కవిత



బోడుప్పల్, జనవరి 8: సికింద్రాబాద్ నుంచి చర్లపల్లి రైల్వే టెర్మినల్ వరకు ప్రతి 10 నిమిషాలకు ఒక బస్సు నడుపుతున్నట్లు ఆర్టీసీ చెంగిచెర్ల డిపో మేనేజర్ కే కవిత తెలిపారు. ఆర్టీసీ చెంగిచెర్ల డిపోలో బుధవారం ఆమె మాట్లాడుతూ, నూతనంగా చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభం అయినందున రైల్వే ప్రయాణికులకు రవాణా సౌకర్యం కల్పించేందుకు నిత్యం 10 నిమిషాలకు ఒక బస్సు నడుపుతున్నామన్నారు. రూట్ నం. 250సీ సికింద్రాబాద్ బ్లూసీ పాయింట్ నుంచి ఉదయం 4.30 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు వయా హబ్సిగూడ, నాచారం, మల్లాపూర్, హెచ్‌పీసీఎల్ మీదుగా ప్లాట్ ఫాం నం.1 చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు, అక్కడి నుంచి సికింద్రాబాద్‌కు బస్సు సౌకర్యం ఉందని చెప్పారు. చర్లపల్లి రైల్వే టెర్మినల్ నుంచి చెంగిచెర్ల, ఉప్పల్, రామంతాపూర్ మీదుగా బోరబండకు ప్రతి రోజు 40 నిమిషాలకు ఒక బస్సును కొత్తగా ప్రారంభించినట్లు చెప్పారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా అదనంగా నడిపే ప్రత్యేక రైళ్లలో ప్రయాణించే ప్రయాణికుల రవాణా సౌకర్యార్థం ప్రతి రోజు ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో ఉప్పల్ నుంచి ప్లాట్ ఫాం నం.9 చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు అదనంగా బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. ఈ సౌకర్యాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

## గ్రామీణాభివృద్ధికి ఉత్పాదక సామర్థ్యాలు తప్పనిసరి

పద్మభూషణ్, భారత్ బయోటెక్ చైర్మన్ డాక్టర్ కృష్ణ ఎల్లా

కొండాపూర్, జనవరి 8: గ్రామీణాభివృద్ధి కేవలం ఉన్నత విద్యతోనే సాధ్యం కాదని, వివిధ రంగాలలో ఉపాధి పొందగల నైపుణ్యాలను సొంతం చేసుకున్నప్పుడే సాధ్యమవుతుందని పద్మభూషణ్ అవార్డు గ్రహీత, భారత్ బయోటెక్ చైర్మన్ డాక్టర్ కృష్ణ ఎల్లా అన్నారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో వర్సిటీ, భారత్ అభియాన్ ఉన్నత్ (భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ)ల సహకారంతో ''స్కిల్ ఇండియా ఫర్ వికసిత్ భారత్ : గ్రామీణ యువతకు భవిష్యత్తు అవకాశాలను కల్పించడం'' అనే అంశంపై కొనసాగుతున్న రెండు రోజుల జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై వర్సిటీ వీసీ ప్రొఫెసర్ బీజే రావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణ ఎల్లా మాట్లాడుతూ, గ్రామీణ అభివృద్ధి కేవలం ఉన్నత విద్యతోనే సాధ్యమవదని, వివిధ రంగాలలో ఉపాధి కల్పించే నైపుణ్యాలతోనే సాధ్యమన్నారు. గ్రామీణ యువతకు నైపుణ్యాలను అందించే దిశగా ఈ సదస్సు ముందుకు సాగాలన్నారు. యువత వికాసం చెందాలంటే జీవితంతో పాటు జీవనోపాధి కూడా ప్రధానమన్నారు. కార్యక్రమంలో వర్సిటీ అధ్యాపక బృందంతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



సదస్సులో డాక్టర్ కృష్ణ ఎల్లా, వీసీ ప్రొఫెసర్ బీజే రావు, తదితరులు

## సాంస్కృతిక మేల్కొలుపులో ఇప్టా మూలాలు

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



ఇండియన్ ప్యూపిల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా) 90 వసంతాల వేడుకలలో పాల్గొన్న నేతలు

తెలుగు యూనివర్సిటీ, జనవరి 8: మతోన్మాదానికి వ్యతిరేకంగా కళారూపాలను రూపొందించాలని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. నాంపల్లిలో గల పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఇండియన్ ప్యూపిల్స్ థియేటర్ అసోసియేషన్(ఇప్టా) 90 వసంతాల వేడుకలు తెలంగాణ ప్రజా నాట్య మండలి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ, దేశంలో ప్రజల సాంస్కృతిక మేల్కొలుపులో ఇప్టా మూలాలు ఉన్నాయన్నారు. సామాజిక బాధ్యత, జాతీయ సమైక్యతపై ప్రజలలో అవగాహన పెంపొందించే లక్ష్యంతో ఏర్పడిన ఇప్టాలో అభ్యుదయ రచయితలు, కవుల కృషిని ఈ సందర్భంగా ప్రతి ఒక్కరిని గుర్తు చేశారు. సామాజిక బాధ్యతను, జాతీయ సమైక్యతపై మరింతగా అవగాహనను పెంపొందించే లక్ష్యంతో నాటకాలు, పాటలు, నృత్యాలను రూపొందించి భారత సాంస్కృతిక వారసత్వాన్ని పునరుద్ధరించాలని ఆయన కోరారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాల నుంచి ఉద్భవించిన పాటలు, నాటకాలను గుర్తుంచుకోవలసిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఇప్టా, అరసం పనిచేయాలన్నారు. అరసం జాతీయ నాయకులు ఆర్వీ రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రజా నాట్య మండలి సీనియర్ నాయకులు నల్లూరి వెంకటేశ్వర్ రావు, అభ్యుదయ రచయితలు కందిమళ్ళ ప్రతాప్ రెడ్డి, అరుణోదయ నాయకురాలు విమలక్క, డాక్టర్ ఏటూకూరి శివప్రసాద్, ప్రముఖ సినీ నటుడు మాదాల రవి, నిర్మాత మద్దినేని రమేశ్, తెలుగు వర్సిటీ పూర్వ వీసీ ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, ఇప్టా రాష్ట్ర నాయకులు రాజేశ్వరరావు, జానకీరామ్, ప్రజానాట్యమండలి వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పలయ్య, పల్లేరు వీరస్వామి, కార్యనిర్వాహక కార్యదర్శి కేవీఎల్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు జి.చంద్రమోహన్ గౌడ్ పాల్గొన్నారు.

## భూ పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలి

మంత్రి పొన్నం ప్రభాకర్

షేక్‌పేట మండల కార్యాలయం ఆకస్మిక తనిఖీ



షేక్‌పేట మండల కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

బంజారాహిల్స్, జనవరి 8: ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బంజారాహిల్స్‌లోని షేక్‌పేట మండల కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిషెట్టితో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయంలో సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించిన మంత్రి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కోసం వచ్చిన దరఖాస్తుల గురించి ఆరా తీశారు. ఇన్‌వర్డ్, అవుట్ వర్డ్ రిజిస్టర్ సరిగా నిర్వహించడం లేదని మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు కృషి చేయాలని, ఎలాంటి ఒత్తిళ్లు వచ్చినా ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చూడాలని ఆదేశించారు. ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇండ్ల సర్వే, కేటాయింపులో లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యాలయం ఆవరణలో నిరుపయోగంగా ఉన్న భవనాన్ని ప్రజా అవసరాల కోసం వాడాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనితారెడ్డితో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రొస్టేట్ క్యాన్సర్‌ను నయం చేస్తామని నమ్మించి..

వయోవృద్ధుడిని మోసగించిన ఘనులు

డిజిటల్ అరెస్టు పేరుతో వేదింపులు

బంజారాహిల్స్, జనవరి 8: ఆయుర్వేదంతో ప్రొస్టేట్ క్యాన్సర్ నయమవుతుందని నమ్మించి ఓ వయోవృద్ధుడిని మోసగించారు. ఆలస్యంగా గ్రహించిన ఆ వృద్ధుడు తాను చికిత్స కోసం ఇచ్చిన లక్షలాది రూపాయలను బ్లాక్ చేయించాడు. ఆ మరుక్షణమే ఢిల్లీ పోలీసులు, సీబీఐ పేర్లతో గుర్తు తెలియని వ్యక్తులు డిజిటల్ అరెస్టు చేసి వేధింపులకు పాల్పడంతో బాధితుడు బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించాడు. ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర కథనం ప్రకారం.., బంజారాహిల్స్ రోడ్ నం.12లో నివాసం ఉండే పెంచికల రఘునందన్ రెడ్డి కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఇటీవల ఫిలింనగర్ ప్రధాన రహదారిలో ఉన్న ఓ సూపర్‌మార్కెట్‌లో శంకర్ కుమార్ అనే యువకుడు పరిచయమయ్యాడు. ప్రొస్టేట్ క్యాన్సర్‌కు ఆయుర్వేదంలో అద్భుతమైన మందు ఉందని, తన తండ్రికి చికిత్స అందిస్తే నయమైందని నమ్మించాడు. మరుసటి రోజు అశోక్ యాదవ్ అనే వ్యక్తి ఫోన్ చేసి శంకర్ కుమార్ ఫోన్ నంబరు ఇచ్చాడని, ఆయుర్వేద మందును తయారు చేసి ఇస్తానని చెప్పుకొచ్చాడు. అతని మాటలను నమ్మిన బాధితుడు ఇంటికి పిలువగా, వంట గదిలోని కొన్ని మసాల దినుసులతో కషాయాన్ని తయారు చేశాడు. అనంతరం, సికింద్రాబాద్‌లోని వెస్ట్ మారెడ్‌పల్లిలో ఉన్న ఓ ఆయుర్వేదిక్ షాపునకు తీసుకెళ్లాడు. అక్కడ షాపు నిర్వాహకుడు మనోజ్ కొన్ని మందులను రాసి వాటికి సుమారు రూ.9,26,820 ఖర్చు అవుతుందని చెప్పాడు. దీంతో రూ.76,800 అడ్వాన్స్‌గా చెల్లించాడు. అనంతరం, రూ.7.50లక్షలను చెక్కు రూపంలో ఇచ్చాడు. కాగా, మొదట కలిసిన శంకర్ కుమార్ తండ్రి చికిత్సకు కేవలం రూ.40వేల మాత్రమే ఖర్చయ్యిందని తెలియడంతో తనను అందరు కలిసి మోసం చేశారని గ్రహించాడు. బ్యాంకుకు ఫోన్ చేసి తాను ఇచ్చిన అమౌంట్‌ను బ్లాక్ చేయాల్సింది అధికారులను కోరాడు. ఇక మరుసటి రోజు నుంచే ఢిల్లీ పోలీసులమని, సీబీఐ అధికారులమని, తాము చెప్పిన అకౌంట్లకు డబ్బులు పంపించాలంటూ గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్లు చేసి వేదింపులకు పాల్పడటం ప్రారంభించారు. దీంతో విసిగి వేసారిపోయిన బాధితుడు పోలీసులను ఆశ్రయించగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వ్యాపార సముదాయాల ఎదుట డస్ట్ బిన్లు

సిటీబ్యూరో: పారిశుధ్య నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూంలో బుధవారం శానిటేషన్ నిర్వహణపై ఏఎంహెచ్‌ఓలు, ఎస్‌డబ్ల్యూం, డిప్యూటీ ఇంజినీర్లు, రాంకీ ఏజెన్సీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, జీహెచ్‌ఎంసీ పరిధిలోని అన్ని సర్కిళ్లలో శానిటేషన్ పనులు, చెత్త సేకరణ, పారిశుధ్య పనుల ప్రగతిపై సమీక్షించారు. స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా నగరాన్ని స్వచ్ఛమైన, ఆకర్షణీయమైన, పరిశుభ్ర నగరంగా రూపొందించే లక్ష్యంతో పనిచేయాలని రఘు ప్రసాద్ సూచించారు. ప్రజలను శుభ్రత పట్ల చైతన్యపర్చాలన్నారు. నగరంలోని అన్ని కాలనీలు, బస్తీలు ప్రధాన రహదారుల శుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో అడిషనల్ కమిషనర్ వేణుగోపాల్ రెడ్డి, సీఎంహెచ్ఓ డాక్టర్ పద్మజ, ఏఎంహెచ్ఓ, ఎస్‌డబ్ల్యూం, రాంకీ ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## జీహెచ్‌ఎంసీ ఖజానాపై రూ.96.63 కోట్ల అదనపు భారం

పెరిగిన పాత బస్తీ స్టీల్ బ్రిడ్జి నిర్మాణ అంచనా వ్యయం

రూ.523.37 కోట్ల నుంచి రూ.620 కోట్లకు పెంచుతూ సర్కారు జీవో జారీ

సిటీబ్యూరో, జనవరి 8 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ పరిధిలో జీహెచ్‌ఎంసీ చేపడుతున్న ప్రాజెక్టు అంచనాలు తారుమారవుతున్నాయి. పనుల ప్రారంభానికి ముందున్న అంచనాలు, ఆ నిర్మాణాలు పూర్తయ్యే నాటికి ఉండటం లేదు. ప్రతి పనిలో 20 నుంచి 30 శాతం పెరుగుదల కనిపిస్తున్నది. ఇందులో భాగంగా తాజాగా నల్గొండ క్రాస్ రోడ్ నుంచి సైదాబాద్, ఐఎస్ సదన్ – ఓవైసీ జంక్షన్ కారిడార్ వరకు నిర్మితమవుతున్న స్టీల్ బ్రిడ్జి ప్రాజెక్టు వ్యయం పెంచుతూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. పన్నులు, గడిచిన కాలంలో ధరల పెరుగుదల దృష్ట్యా రూ.523.37 కోట్ల ప్రాజెక్టు వ్యయాన్ని రూ.620 కోట్ల పెంచాలన్న ఇంజనీర్ల ప్రతిపాదనను ఆమోదించింది. ఈ మేరకు జీవోను జారీ చేస్తూ పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, నిర్ణీత సమయంలో ప్రాజెక్టు పూర్తి చేయలేక, గడిచిన ఏడాది కాలంలో పనులను నత్తనడకన జరుపుతున్న అధికారుల నిర్లక్ష్యానికి జీహెచ్‌ఎంసీ ఖజానాపై రూ.96.63 కోట్ల భారం పడనుంది.



విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్, విద్యుత్ ఉద్యోగులు

## 24 వేల ఆర్టిజన్లకు పదోన్నతులు కల్పించాలి

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 8 (నమస్తే తెలంగాణ): విద్యుత్ సంస్థల్లో ఉన్న 24 వేల మంది ఆర్టిజన్లను అర్హతలను బట్టి పదోన్నతులు కల్పించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో బుధవారం తెలంగాణ విద్యుత్తు బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర మహాసభలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సంస్థల్లో 50 శాతం పోస్టులను బీసీ అధికారులతో భర్తీ చేయాలని కోరారు. ఈ సందర్భంగా సంఘం రూపొందించిన 2025 డైరీ, వాల్, టేబుల్ క్యాలెండర్లను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొడెపాక కుమారస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యం వెంకన్న గౌడ్, రాష్ట్ర నాయకులు ప్రేమ్‌కుమార్, అశోక్ కుమార్, డాక్టర్ చంద్రుడు, యాదగిరి, మారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




## స్టార్‌లో కాంప్రెహెన్సివ్ స్ట్రోక్ కేర్ సెంటర్

సిటీబ్యూరో, జనవరి 8(నమస్తే తెలంగాణ): బంజారాహిల్స్‌లోని స్టార్ ఆసుపత్రిలో బుధవారం స్టార్ కాంప్రెహెన్సివ్ స్ట్రోక్ కేర్ సెంటర్‌ను ప్రారంభించారు. దీంతో పక్షవాత రోగ చికిత్స విధి విధానాలలో అన్ని రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయని వైద్యులు తెలిపారు. సమాజ సమగ్ర ఆరోగ్య పరిరక్షణ దృష్టితో స్టార్ హాస్పిటల్స్ ప్రత్యేక ప్యాకేజీలను సైతం ప్రకటించింది. స్ట్రోక్ ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్ నం. 90711 04108 ద్వారా సమాచారం పొందొచ్చు.

## గాంధీ శిల్ప బజార్ మేళా ప్రారంభం

కొండాపూర్, జనవరి 8: మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన గాంధీ శిల్ప బజార్ మేళా కార్యక్రమానికి డెవలప్మెంట్ ఆఫ్ కమిషనర్ హ్యాండీక్రాఫ్ట్స్ డైరెక్టర్ లక్ష్మణ్ రావు అట్కూరి బుధవారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మేళాలో వివిధ రాష్ట్రాలకు చెందిన హస్తకళా ఉత్పత్తులను సందర్శకులకు అందుబాటులో ఉంచినట్లు, హస్తకళాకారులకు చేయూతనిచ్చే దిశగా మేళా కొనసాగుతుందన్నారు. నాణ్యమైన చేనేత ఉత్పత్తులు సరసమైన ధరలకు అందించనున్నట్లు తెలిపారు. మేళాలో భాగంగా ప్రతి రోజు సాయంత్రం వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనలతో సందర్శకులకు మరింత ఆహ్లాదాన్ని పంచనున్నారు. ప్రదర్శనల్లో భాగంగా నిర్మల విశ్వేశ్వర్‌రావు శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. జనవరి 13వ తేదీ నుంచి సంక్రాంతి సంబురాలు ప్రారంభం కానున్నట్లు శిల్పారామం ప్రత్యేక అధికారి కిషన్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో డెవలప్మెంట్ ఆఫ్ కమిషనర్ హ్యాండీక్రాఫ్ట్స్ అడిషనల్ డైరెక్టర్ అపర్ణ, జీఎం నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.



శిల్పారామంలో గాంధీ శిల్ప బజార్ మేళను ప్రారంభిస్తున్న దృశ్యం